సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



భుజంగరావు బంగారం

ఆయన ఓ దివ్యాంగుడు. అయితేనేం... ఆత్మస్థైర్యంతో డ్యాన్స్ పోటీల్లో రాణిస్తున్నాడు. ప్రశంసలు అందుకుంటున్నాడు. - 8లో



వీడీవీకేలను బలోపేతం చేయాలి

ప్రధానమంత్రి వన్‌ధన్ వికాస కేంద్రాల(వీడీవీకే) కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ ఎ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. - 8లో



భర్త చేతిలో భార్య హతం

దత్తిరాజేరు మండలం గుచ్చిమి గ్రామ సమీపంలోని ఆయిల్ పాం తోటలో చుక్క పేటకు చెందిన యాకల గౌరమ్మను భర్త హత్యచేశాడు. - 8లో

న్యూస్‌రీల్

ఉపాధి హామీ పనులు ఆపండి!

● హైకోర్టు ఆదేశాలు


రేగు మహేశ్వరరావు

సాలూరు:మండలంలోని మూడు పంచాయతీల్లో ఉపాధి హామీలో భాగంగా వెండర్ ద్వారా చేపట్టిన పనులు నాలుగు వారాల పాటు నిలిపివేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల న్యాయ సలహాదారు రేగు మహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన సాలూరులోని తన కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సాలూరు మండలంలోని శివరాంపురం, బాగువలస, పారన్నవలస పంచాయతీల సర్పంచ్‌లు వారి పంచాయతీల్లో నిబంధనలకు విరుద్ధంగా వెండర్‌ల పేరుతో ప్రైవేట్ వ్యక్తులు ఉపాధి హామీ పనులు చేపడుతున్నారని హైకోర్టును ఆశ్రయించి రిట్‌పిటిషన్ వేశారన్నారు. ఈ మేరకు ఆ పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు నాలుగు వారాల పాటు ఆ పనులు నిలిపివేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి, మన్యం జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఉపాధిహామీ పనులు చేపడుతున్న వెండర్‌లకు వ్యక్తిగత నోటీసులు పంపించాలని కోర్టు ఆదేశించినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ కుట్రతో అన్యాయంగా ఎవరైనా ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు జరిగితే వారు తన వద్దకు వస్తే కచ్చితంగా న్యాయసహకారం అందిస్తానని రేగు మహేశ్వరరావు చెప్పారు.

రామలింగేశ్వరస్వామికి పూజలు


రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: మండలంలోని కొట్టు గ్రామంలో రామలింగేశ్వర పార్వతి, గణేష్, సుబ్రహ్మణ్యం, షిర్డీసాయిబాబా విగ్రహ, ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠోత్సవాల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి గురువారం పాల్గొన్నారు. సర్వజోస్యుల వెంకటరమణ శాస్త్రి ఆధ్వర్యంలో కుంకుమ పూజలు జరిపారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన రావు, కొమరాడ ఎంపీపీ శెట్టి శ్యామల, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు తదితర నాయకులు పూజల్లో పాల్గొన్నారు.

తోటపల్లిలో ఆధ్యాత్మిక సందడి


జలాధివాసంలో ఉన్న వేంకటేశ్వరస్వామి విగ్రహాలకు పూజలు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ పూజలను రెండవరోజు గురువారం శాస్త్రోక్తంగా జరిపారు. సుప్రభాతం, విష్ణుసూక్త పారాయణం, సేవాకాలం, ద్రవిడ ప్రబంధం, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠాపనం, పంచగవ్యాధివాసం, హోమములు, క్షీరాధివాసం, ఆదివాస హోమములు, జలాధివాసం తదితర పూజలను బ్రహ్మశ్రీ కొడవగంటి వేంకట నరసింహాచార్యులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహప్రతిష్ఠ పూజలు శుక్రవారం జరగనున్నట్టు ఈఓ వి.వి.సూర్యనారాయణ తెలిపారు. ఈ నెల 8న తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కల్యాణోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.

ధాన్యం కొనుగోలు చేస్తాం

● జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ శ్రీనివాసరావు

సాక్షి ఎఫెక్ట్...

వీరఘట్టం: ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యంను ప్రభుత్వం టార్గెట్‌ల పేరుతో పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోవడంపై జిల్లా రైతాంగం ఆందోళన చెందుతున్న అంశంపై ఈ నెల 3న 'లక్ష్యం పూర్తి...మరి మిగులు మాటేంటి' శీర్షిన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ శ్రీనివాసరావు స్పందించారు. రైతులు ఆందోళన చెందవద్దని, రైతుల వద్ద ఉన్న ప్రతీగింజను గొనుగోలు చేస్తామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరఘట్టం మండంలో 1,582 టన్నుల ధాన్యం రాశులుగా, 3,648 టన్నుల ధాన్యం నూర్పిడి చేసి అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్టు గుర్తించామన్నారు. ధాన్యంను దళారులకు విక్రయించవద్దన్నారు.

కొత్త బాధ్యతలు

విజయనగరం అర్బన్: వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగం జిల్లా అధ్యక్షునిగా విజయనగరం పట్టణానికి చెందిన డోల మన్మథకుమార్‌ను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియామక ఉత్తర్వులు విడుదల చేశారు.

చిత్రంలో కనిపిస్తున్నది సుమారు 15 ఏళ్ల కిందట గరుగుబిల్లి మండలం నాగూరు గ్రామానికి సమీపంలో నాగావళి నది దగ్గరలో నిర్మించిన పవర్ ప్లాంట్. దీని విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఒక మెగావాట్. ఈ ప్లాంట్‌కు నీరు ఆశించిన స్థాయిలో అందకపోవడంతో ఏడాదిలో సుమారు 7 నెలల పాటు మూతబడుతోంది. వేసవి రాకముందే నదిలో నీరులేక ప్రస్తుతం ఈ ప్లాంట్ నెలరోజుల నుంచి షట్‌డౌన్ అయ్యింది.



జలంలేని విద్యుత్ కేంద్రాలు!

- ఉన్నప్లాంటు ఏడు నెలల పాటు మూత
- కొత్తగా మరో రెండ్లు ప్లాంట్ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం
- విస్తుపోతున్న 'తోటపల్లి' రైతులు, నిపుణులు
- నీరులేకుండా విద్యుత్ ఉత్పత్తి సాధ్యమేనా అంటూ ప్రశ్న
- ప్లాంట్‌ల పేరుతో రాయితీలు కొట్టేసే పన్నాగం అంటూ విమర్శలు


తోటపల్లి జలాశయం నుంచి గురువారం నదిలోకి వస్తున్న 190 క్యూసెక్కుల నీరు

వీరఘట్టం:

ఉన్న విద్యుత్ ప్లాంట్‌కే సరిగా నీరు అందడం లేదు. నాగావళి నదిలో నీరు లేక ఏడాదిలో ఏడునెలల పాటు మూతపడుతోంది. ఇప్పుడు తాజాగా తోటపల్లి జలాశయం దిగువ భాగంలో కుడివైపున 2.7 మెటావాట్లు, ఎడమవైపు పాతరెగ్యులేటర్ దిగువ భాగంలో 1.5 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేసే రెండు జల విద్యుత్ కేంద్రాల నిర్మాణాలకు రాష్ట్ర మంత్రి మండలి ఇటీవల ఆమోదం తెలిపింది. ఇక్కడ వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే జలవిద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతికూల పరిస్థితులు ఉన్నాయి. తోటపల్లి ప్రాజెక్టు గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 2.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో 1.932 టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయి. అప్పుడే వేసవి ప్రారంభం కావడంతో పాటు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత ఇంకా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. దీంతో నదీ జలాలు ఇంకా తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ పవర్ ప్లాంట్స్ నిర్మాణాలు జరిగితే ఇటువంటి పరిస్థితుల్లో నీటి పంపిణీ సాధ్యం కాదని నిపుణులు అంటున్నారు. వాస్తవ పరిస్థితులు గుర్తించకుండా విద్యుత్ ప్లాంట్‌ల ఏర్పాటు అవివేకమైన చర్యగా పేర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి....

మంత్రి మండలి ఆమోదించిన జలవిద్యుత్ కేంద్రం నుంచి 2.7 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేయాలంటే తోటపల్లి ప్రాజెక్టు నుంచి ప్రతీ రోజు 30 వేల నుంచి 40 వేల క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెట్టాలి. వరదలు వచ్చినప్పుడు తప్ప ఇంత వరకు ఈ స్థాయిలో ఏ రోజు నీరు విడుదల చేయలేదు. 2018 ఆగస్టులో ఒడిశాలో వరదలు సంభవించినప్పుడు మాత్రమే గరిష్ఠంగా లక్షకు పైగా క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెట్టారు. ఆ తర్వాత అంత స్థాయిలో ఎప్పుడూ వరదలు రాలేదు. అంత నీటిని కూడా విడుదల చేయలేదు. ప్రస్తుతం తోటపల్లి ఇన్‌ఫ్లో 190 క్యూసెక్కులు ఉండగా, నదిలోకి కూడా 190 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గత నాలుగు నెలలుగా నదిలో విడిచిపెడుతున్న నీరు గరిష్ఠంగా 500 క్యూసెక్కుల కంటే మించలేదు. గతేడాది వర్షాకాలంలో కూడా గరిష్ఠంగా 25 వేల క్యూసెక్కుల నీటి మించి నీటిని విడిచిపెట్టిన దాఖలాలు లేవు. ఈ పరిస్థితుల్లో 2.7 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తిని ఈ నీటితో ఉత్పత్తి చేయగలమా అంటే అది సాధ్యం కాదన్నది నిపుణుల మాట.


నాగావళి నదికి ఎత్తులో ఉన్న ఎడమకాలువ పాత రెగ్యులేటర్

1.5 మెగావాట్ల ప్లాంట్‌దీ అదే పరిస్థితి

ఏటా ఖరీఫ్‌కు జూలై నెలాఖరు, లేదంటే ఆగస్టు మొదటి వారంలో తోటపల్లి పాత ఆయకట్టు పరిధిలో ఉన్న ఎడమ కాలువకు నీరు విడుదల చేసి నవంబర్ నెలాఖరులో నీటి విడుదల ఆపేస్తున్నారు. అంటే, నాలుగు నెలలు మాత్రమే నీరు విడిచిపెడుతున్నారు. మిగిలిన ఎనిమిది నెలల్లో వేసవిలో ఓ నెల రోజులు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నారు. మరి ఇటీవల ప్రభుత్వం ఆమోదించిన జలవిద్యుత్ కేంద్రం నిర్మాణం జరిగితే ఇక్కడ 1.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడం ఏడాదికి ఐదు నెలలు మాత్రమే ఉంటుంది.

ఎడమ కాలువకు 414 క్యూసెక్కుల నీటిని గరిష్ఠంగా విడిచిపెట్టవచ్చు. ఇంత స్థాయిలో నీరు విడిచిపెడితే దిగువ ఉన్న కాలువ గట్లుకు గండ్లు పడే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో ఎడమ కాలువ వైపు ఏర్పాటు చేస్తామన్న 1.5 మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు కూడా ప్రతికూల పరిస్థితులు ఉన్నట్లు కొందరు అధికారులు పేర్కొంటున్నారు.

ప్లాంట్‌ల పేరుతో రాయితీలు పొందేందుకేనా?

తోటపల్లి జలాశయం సమీపంలో పవర్ ప్లాంట్‌ల నిర్మాణాలకు ఫీజిబులిటీ లేకున్నా ప్రభుత్వం ఆమోదం తెలపడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. పవర్ ప్లాంట్ పేరుతో తక్కువ ధరకే ప్రభుత్వ భూమిని సొంతం చేసుకోవచ్చు. పవర్ ప్లాంట్ నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి రూ.కోట్లు రాయతీలు పొందవచ్చు. బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు పొందవచ్చు. ఇలా ప్రభుత్వం నుంచి పొందిన రాయితీ సొమ్మును ప్రైవేటు వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి రూ.కోట్లు సంపాదించవచ్చు. ఈ ప్రాజెక్టులను తమ అనుయాయులకు ఇస్తే వారి నుంచి కమీషన్లు దండిగా వస్తాయనే నెపంతో కూటమి నాయకులు తోటపల్లి వద్ద పవర్‌ప్లాంట్‌ల నిర్మాణాలకు తెరతీశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


1.5 మెగావాట్ల పవర్‌ప్లాంట్ నిర్మించాలని అనుకుంటున్న ఎడమకాలువ పాత రెగ్యులేటర్ దిగువభాగం

నీరు విడుదల చేస్తేనే పవర్ ప్లాంట్ పనిచేస్తుంది

తోటపల్లి కాలువకు సాగునీరు విడిచి పెడితే ఆ నీటిని కొంత వినియోగించుకుని పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం ఆధారంగా ఏడాదిలో నాలుగు నుంచి ఐదు నెలలు మాత్రమే ఎడమకాలువకు నీటిని విడిచిపెట్టగలం. మిగతా కాలంలో నీటిని విడిచి పెట్టే పరిస్థితి లేదు. ఇటీవల 40 క్యూసెక్కుల నీటిని రబీలో ఆరుతడి పంటలకు విడిచిపెట్టాం. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తక్కుగా ఉన్నందున రైతుల విజ్ఞప్తి మేరకు ఈ నీటిని విడుదల చేశాం.

– టి.రఘునాథ్, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు, తోటపల్లి ప్రాజెక్టు

భూ సమస్యలను సత్వరమే పరిష్కరించండి

● సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి


భూ సమస్యల వినతులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

వీరఘట్టం: ఇటీవల నిర్వహించిన రీ-సర్వే, రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి సూచించారు. వీరఘట్టం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్‌ఐ లక్ష్మునాయుడుతో మాట్లాడారు. భూసమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. రైతు సమస్యల పరిష్కారంలో వీరఘట్టం రెవెన్యూ సిబ్బంది చురుగ్గా వ్యవహరించడంపై అభినందించారు.

నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి పి-4 మోడల్


వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి 'పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టనర్‌షిప్ (పి-4) ఒక కీలకమైన సాధనమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రభుత్వం, ప్రైవేటు రంగం, ప్రజల భాగస్వామ్యంతోనే రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధిని సాధించగలదన్నారు. పేదరిక నిర్మూలన, విద్య, వైద్యం, ఇతర సామాజిక సేవల్లో మెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక, వ్యవసాయాభివృద్ధి వంటి లక్ష్యాలను పి-4తో సాధించవచ్చన్నారు. ప్రతి నియోజకవర్గంలో నోడల్ అధికారికి సహాయపడేందుకు ఆరుగురు సభ్యుల బృందం, గ్రామ సచివాలయాల నుంచి ఐదుగురు, స్కిల్ డెవలప్‌మెంట్ నుంచి ఒక యువ నిపుణుడు ఉంటారని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, డీఆర్వో కె.హేలత, డీపీఓ టి.కొండలరావు, డీఈఓ ఎస్.తిరుపతినాయుడు, డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలకు 67 కేంద్రాల గుర్తింపు

● డీఈఓ తిరుపతినాయుడు


వీరఘట్టం బాలికల ఉన్నత పాఠశాలలో టెన్త్ బాలికలతో మాట్లాడుతున్న డీఈఓ తిరుపతినాయుడు

వీరఘట్టం: ఈ ఏడాది మార్చి 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 67 కేంద్రాలను గుర్తించామని, వీటిలో 22 సీ-సెంటర్లు ఉన్నట్టు పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. తిరుపతినాయుడు తెలిపారు. వీరఘట్టం బాలికోన్నత పాఠశాలను ఉదయం 8.45 గంటలకు ఆయన తనిఖీ చేశారు. బడికి ఆలస్యంగా వచ్చిన కొందరు పదో తరగతి బాలికలతో మాట్లాడారు. అనంతరం ఫోన్‌లో వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్నందున పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధచూపాలని కోరారు. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 10,453 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయనున్నారన్నారు. వీరిలో 5,114 మంది బాలురు, 5,339 మంది బాలికలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది కూడా అత్యుత్తమ ఫలితాల సాధనకు కృషిచేస్తున్నామన్నారు. వీరఘట్టం మండలం గంగమ్మపేట పరీక్ష కేంద్రంలో చూసిరాతలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ సెంటర్‌కు పరీక్షల సమయంలో విద్యార్థులు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు వచ్చేఏడాది పరీక్ష కేంద్రం మార్పునకు చర్యలు తీసుకుంటామన్నారు.

331 మోడల్ ప్రైమరీ స్కూల్స్‌ను గుర్తించాం...

ప్రభుత్వ నూతన విద్యావిధానం ప్రకారం వచ్చే విద్యా సంవత్సరం నుంచి జిల్లాలో 331 మోడల్ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభిస్తామని డీఈఓ తెలిపారు. ఈ పాఠశాలలో ప్రతి తరగతికి ఒక టీచర్ ఉంటారన్నారు. జిల్లాలో పాలకొండ, వీరఘట్టం, కొమరాడ, పాచిపెంట మండలాల్లోని 9 యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వచ్చిన చోట ఆ పాఠశాలలను యథావిధిగా కొనసాగించేలా చూడాలని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. ఆయన వెంట ఎంఈఓ ఆర్.ఆనందరావు, స్కూల్ హెచ్‌ఎం డి.నాగమణి ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు

విజయనగరం అర్బన్:

నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. రాష్ట్రంలోని సహజ వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటూ రాష్ట్ర స్థితిగతులను మార్చేలా స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్లాన్ కోసం సిద్ధం చేసిన పది సూత్రాల ప్రణాళికను అధికారులంతా చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల కలెక్టర్లతో గురువారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పేదరిక నిర్మూలన, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, గ్యాస్ ప్లాంట్లు, ఎంఎస్‌ఎంఈ సర్వే తదితర అంశాలపై సమీక్షించారు. సున్నా పేదరికం కోసం పీ-4 విధానంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సీఎస్ ఆదేశించారు. దీని కోసం అందుబాటులో ఉన్న వనరులను గుర్తించాలన్నారు. గ్రామ, మండల స్థాయిలలో సమగ్రంగా అధ్యయనం చేసి వీటిని రూపొందించాలని సూచించారు.

ప్రతి నియోజకవర్గానికి ఒక జిల్లా స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించామన్నారు. వీరికి సహాయంగా ఐదుగురు సిబ్బందిని సమకూరుస్తామని చెప్పారు. ఎంఎస్‌ఎంఈ సర్వేను మార్చి 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రస్థాయిలో పలువురు ఉన్నతాధికారులతోపాటు, జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సీపీఓ పి.బాలాజీ, జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డీపీఓ టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఔషధమూలికలకు అడవే ఆధారం


మాట్లాడుతున్న పద్మశ్రీ పురస్కార గ్రహీత, గిరిజన వైద్యురాలు లక్ష్మీకుట్టి

- గిరిజన వర్సిటీ సదస్సులో పద్మశ్రీ పురస్కార గిరిజన వైద్యురాలు లక్ష్మీకుట్టి
- ప్రాచీన గిరిజన విజ్ఞానం గొప్పది: వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: ఔషధ మూలికలకు అడవే ఆధారమని, అక్కడ దొరికే చెట్ల వేళ్లు, బెరడు, ఆకులు, జిగురును వినియోగించి ఆరోగ్యవంతమైన మానవ సమాజాన్ని నిర్మించవచ్చని కేరళకు చెందిన పద్మశ్రీ పురస్కార గ్రహీత, గిరిజన వైద్యురాలు లక్ష్మీ కుట్టి అన్నారు. స్థానిక కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో 'రీసైలియన్స్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ట్రైబల్ సిస్టం' అనే అంశంపై రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సుకు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణితో కలిసి ఆమె గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ అడవిలో దొరికే చెట్లు, మొక్కలే కాకుండా మట్టి, రాళ్లు, నీరు తదితరమైనవన్నీ వైద్యానికి పనికివస్తాయన్నారు. రోగాన్ని, అవసరాన్ని, వ్యక్తి శరీర ధర్మాన్ని బట్టి మందులు ఇవ్వాలన్నారు. అడవిలో వెళ్తున్నప్పుడు మౌనంగా ఉండే చెట్లు, మొక్కలు, గాలి, నీరు, ప్రకృతి మనతో మాట్లాడతాయని, ఆ స్థితికి వెళ్లినపుడు వనదేవత సహకరిస్తుందని తన అనుభవాలను పంచుకున్నారు. వీసీ కట్టిమణి మాట్లాడుతూ ప్రాచీన గిరిజన విజ్ఞానం విశిష్టమైనదిగా పేర్కొన్నారు. గిరిజనులకు తెలిసిన విజ్ఞానం ప్రకృతి ప్రసాదించినదన్నారు. గ్రహాల గతులు, రుతువులు, పంటలకు సంబంధించిన పరిజ్ఞానం, వివిధ వ్యాధులను గుర్తించడం, దానికి పసరులతో వైద్యం చేయడం వంటి అంశాలపై ప్రస్తుతం ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిని సత్కరించారు. సోషల్ వర్క్ ట్రైబల్ స్టడీస్, సోషియాలజీ, ఇంగ్లిష్ విభాగాల సంయుక్త నిర్వహణలో జరిగిన సదస్సులో సెమినార్ కన్వీనర్‌గా డాక్టర్ గణేష్, కో-కన్వీనర్లుగా డాక్టర్ దివ్య, డాక్టర్ ప్రమాచటర్జీ నాగ్, డాక్టర్ బాలుమూరి వెంకటేశ్వర్లు వ్యవహరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల డీన్‌లు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా మ్యుటేషన్లు పరిష్కరించాలి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: రీ సర్వే, రెవెన్యూ సదస్సులు, మీ సేవ పోర్టల్‌లో వచ్చే మ్యుటేషన్లను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తహసీల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ సమస్యలపై సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 రోజులు దాటి ఒక్కరోజు ఆలస్యమైనా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం తీరును సబ్ కలెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం జారీకి ముందే రైతులకు వన్‌బీని అందజేయాలని సూచించారు. తుది ఆర్‌ఓఆర్ (రికార్డ్స్ ఆఫ్ రైట్స్)అంటే భూమికి సంబంధించిన వివిధ హక్కులను వివరించే కీలకమైన పత్రమని, అందులో భూయాజమాన్యం, అద్దె, భూమి వినియోగం, ఇతర సంబంధిత సమాచారం ఈ పత్రంలో ఉన్నందున క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి జారీ చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, డీఆర్వో కె.హేమలత, భూసర్వే, ల్యాండ్ రికార్డుల అధికారి, మండల తహసీల్దార్లు పాల్గొన్నారు.

కమనీయం.. ఉమాసదాశివుని కల్యాణం


స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతున్న ఉమాసదాశివుడి కల్యాణం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. ముందుగా ఆలయాన్ని పవిత్ర జలంతో శుద్ధిచేసి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. వేకువజామున నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. శివుడికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫలరసాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మల్లిఖార్జునశర్మ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం శివ, పార్వతులను పట్టువస్త్రాలు, వివిధ రకాల స్వర్ణాభరణాలతో సుందరంగా అలంకరించి రామతీర్థం పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం దేవాలయంలోకి తీసుకువచ్చి వేద మంత్రోచ్చరణ, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కళ్యాణాన్ని వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎద్దులిల్లి పుష్పనాథం


ఎద్దులిల్లి పుష్పనాథం

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా పాలకొండ నియోజకవర్గానికి చెందిన ఎద్దులిల్లి పుష్పనాథం నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో పార్టీ కార్యాలయం ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

సెల్‌షాపులో చోరీ


పరిశీలిస్తున్న ఎస్సై సింహాచలం, సిబ్బంది

బలిజిపేట: మండల కేంద్రం బలిజిపేట ప్రధాన రహదారిలో ఉన్న సప్తగిరి సెల్‌షాపులో సుమారు రూ.85వేల సెల్‌ఫోన్లు, బ్లూటూత్‌లు చోరీకి గురయ్యాయి. షాపుయజమాని శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సింహాచలం ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనాస్థలానికి వచ్చి చోరీ జరిగిన పర్యవేక్షించారు. బ్రాండెడ్ కంపెనీలకు చెందిన కొత్తవి 8పెద్ద ఫోన్లు, 5బ్లూ టూత్‌లు పోయినట్లు షాపు యజమాని శ్రీనివాసరావు తెలిపారు. షాపు షట్టర్లకు ఉండే తాళాలు పగలకొట్టి చోరీ చేశారన్నారు. ఉదయం వచ్చి చూసే సమయానికి షట్టరు దిగువకు దించి ఉందని లోపల వస్తువులు పోయినవి లేనివి నిర్ధారణ చేసుకుని ఫిర్యాదు చేసినట్లు వాపోయాడు. దీనిపై ఎస్సై సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

కుక్కలదాడి ఐదుగొర్రెల మృతి


కుక్కలదాడిలో మృతిచెందిన గొర్రెలవద్ద విలపిస్తున్న రామస్వామి దంపతులు


బాడంగి: మండలంలోని పూడివలసలో గురువారం తెల్లవారుజామున జరిగిన కుక్కలదాడిలో గ్రామానికి చెందిన ఇప్పిలిరామస్వామి ఐదు గొర్రెలు మృతిచెందగా మరో 6గొర్రెలు గాయాలపాలై కొనఊపిరితో ఉన్నాయి. ఎప్పుడూ మాదిరిగానే తన గొర్రెలను శాలలో ఉంచగా కుక్కలు దాడిచేసి కరిచిచంపినట్లు బాధితుడు తెలిపాడు. మరో ఆరు గొర్రెల పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందన్నారు. గతంలో కూడా రామస్వామి గొర్రెలు కుక్కల దాడిలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గాయాలైన గొర్రెలకు పశువైద్యాధికారి సతీష్ వైద్యచికిత్స అందజేశారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వృద్ధుడి అదృశ్యం


సత్యం

బాడంగి: మండలంలోని గజరాయునివలసకు చెందిన దాసరి సత్యం (80)అనే వృద్ధుడు రెండురోజులుగా కనిపించడం లేదని స్థానిక పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. ఆయన కుమారుడు రమణరావు ఇచ్చిన ఫిర్యాదులో బుధవారం ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లిన వ్యక్తి మరుసటిరోజు వరకు ఇంటికి రాలేదని కావున పోలీసులు వెతికి తమకు అప్పగించాలని కోరినట్లు ఎస్సై ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసినవారు సమాచారమివ్వాలని కోరారు.

విజయనగరంలో మరో వ్యక్తి..


పోలిపల్లి ఏసు

విజయనగరం క్రైమ్: స్థానిక తోటపాలెంలో నివాసం ఉంటున్న పోలిపల్లి ఏసు జనవరి 29 నుంచి కనబడడం లేదని కుటుంబసభ్యులు వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదుచేశారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. తోటపాలెంలో నివాసం ఉంటున్న ఏసు జనవరి 29న రాత్రి 10 గంటల సమయంలో డ్యూటీకి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి ఇప్పటివరకూ ఇంటికి రాలేదని, అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లభించలేదని ఆయన భార్య పోలిపల్లి సంతోషి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

భుజంగరావు బంగారం



ఆ యువకుడు చిన్నతనంలోనే పోలియో బారిన పడ్డాడు. నడిచేందుకు కాళ్లు సహకరించవు. చదివేందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితి అనుకూలించదు. అసలే పేదరికం. తల్లిదండ్రులు రోజువారీ వలస కూలీలు. దీంతో జీవన పోరాటం ఎదురీత అయింది. అయినా పట్టుదల, ఆత్మస్థైర్యం ఉన్నత చదువులు చదివేలా చేసింది. మంచి డ్యాన్సర్‌గా రాణించేలా చేసింది. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన ఆ యువకుడే రాజాం మండలంలోని పెనుబాక గ్రామానికి చెందిన బంగారి భుజంగరావు. ఈ యువకుడు నెలరోజులుగా ఫేమస్ అయ్యాడు. గతేడాది డిసెంబర్ 31 రాత్రి చేసిన ఓ డ్యాన్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. లక్షలాదిమంది లైక్‌లు సొంతంచేసుకున్న భుజంగరావు వేలాదిమంది అభిమానులను సంపాదించుకున్నాడు. ఆ యువకుడి జీవన ప్రస్థానం ఇలా ఉంది.

-రాజాం

- డ్యాన్స్‌లో రాణిస్తున్న యువకుడు
- అంగవైకల్యాన్ని ఎదురించి జీవనపోరాటం
- మరిన్ని అవకాశాల కోసం ఎదురుచూపు

భుజంగరావు స్వగ్రామం తెర్లాం మండలంలోని ఉద్దవోలు. తల్లిదండ్రులు మరియమ్మ, జోగారావులు రోజువారీ వలస కూలీలు కావడంతో రాజాం మండలం పెనుబాక రావడంతో ఇక్కడికి వచ్చిన భుజంగరావు నాలుగు కిలోమీటర్ల దూరంలోని బొద్దాం జెడ్పీ హైస్కూల్‌లో చేరి పట్టుదలతో 10వ తరగతి వరకూ చదివాడు. ప్రతిరోజూ ట్రై సైకిల్‌పై వెళ్లి, ఒక పూట తినకుండా పస్తులు ఉంటూ ఆ రోజుల్లో పదవతరగతి పూర్తిచేశాడు. అనంతరం రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసిన ఆయనను రాజాంలోని పలువురు దాతలు ప్రోత్సహించారు. ఫలితంగా సామర్లకోటలో తెలుగు పండిట్ ట్రైనింగ్ కళాశాలలో తెలుగు పండిట్ కోర్సు పూర్తిచేశాడు. అనంతరం రెండు డీఎస్సీలకు ప్రిపేరయ్యాడు. ఒకటి రెండు మార్కులతో టీచర్ ఉద్యోగాన్ని కోల్పోయిన బంగార్రాజు తన పట్టు వదలలేదు. తాను 8 వ తరగతి చదువుతున్న సమయం నుంచే రాజాంలోని బాలభవన్ బాటపట్టాడు. అక్కడి డ్యాన్స్ మాస్టర్ సుంకరి రమేష్ ప్రోత్సాహంతో పాటు డ్యాన్స్ మాస్టర్ తారక్ సారథ్యంలో డ్యాన్స్ నేర్చుకుని మంచి డ్యాన్సర్‌గా ఖ్యాతి గడించాడు. పదిమంది దివ్యాంగులను ఒక్కటిగా చేసి డ్యాన్స్ ట్రూప్ తయారుచేసుకుని, తాను బతుకుతూ పదిమందిని బతికిస్తూ ముందుకువెళ్తున్నాడు.


పుష్ప-2 సినిమాలోని గంగో రేణుకా తల్లి సాంగ్‌కి భుజంగరావు డ్యాన్స్

ఎన్నో షోలు..

భుజంగరావు ఇప్పటివరకూ 40కిపైగా టీవీ, ప్రమోషన్ షోల్లో నటించాడు. శ్రీదేవి డ్రామా కంపెనీలోని కాంచన సినిమాలో నిల్చో..నిల్చో సొంత కాళ్లపైన నిల్చో అనే పాటకు మణికంఠ మాస్టర్ టీమ్‌లో డ్యాన్స్ చేసి అందరినీ ఆకట్టుకున్నాడు. అనంతరం ఢీ సెలబ్రెటీ స్పెషల్-1లో మణికంఠ మాస్టర్ కొరియగ్రాఫ్‌లో డ్యాన్స్ పెర్‌ఫార్మెన్స్ ఇచ్చాడు. ఏడాది క్రితం మారో మారో గోలీ మారో సాంగ్‌లో పెరఫార్మెన్స్ చేశాడు. చంద్రముఖి-2 సినిమా ప్రీ రిలీజ్‌లో దంచుకోట సాంగ్‌కి లారెన్స్ మాస్టర్ సారథ్యంలో డ్యాన్స్ చేసి బహుమతి పొందాడు. గతేడాది 31న పుష్ప-2 సినిమాలోని గంగో రేణుకా తల్లి సాంగ్‌కి డ్యాన్స్ చేసి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాడు. పెద్దపెద్ద సినీ నటులు, సెలబ్రిటీలతో పరిచయాలు ఉన్న భుజంగరావు తోటి దివ్యాంగులకు చేయూతనివ్వడమే లక్ష్యంగా, రాజాం చుట్టు పక్కల దివ్యాంగులకు ఏదో ఒక కళ ఉండాలని ప్రోత్సహిస్తూ ముందుకు నడిపిస్తున్నాడు. ఇటీవల ఎన్‌టీఆర్ సినీ వజ్రోత్సవ అవార్డును విశాఖపట్నంలో పౌర గ్రంథాలయంలో సినీ ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నాడు. అంతకుముందు కాకినాడలో చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ పురస్కారం అందుకున్నాడు. ప్రైవేట్ షోల్లో పలు పురస్కారాలు భుజంగరావును వరించాయి.


ఓ స్టేజ్ షోలో భుజంగరావు


డ్యాన్స్‌మాస్టర్ లారెన్స్‌తో భుజంగరావు

మంచి టీచర్‌గా.. మంచి డ్యాన్సర్‌గా పేరుకోసం..

నాకు చిన్నప్పటినుంచి టీచర్ అవ్వాలని ఉండేది. అందుకే ఎంతో కష్టపడి తెలుగుపండిట్ ట్రైనింగ్ అయ్యాను. నేను శిక్షణ పొంది బయటకు వచ్చిన తరువాత డీఎస్సీలు తగ్గిపోయాయి. తెలుగు పండిట్ టీచర్ పోస్టులు కూడా పెద్దగా లేవు. చిన్నప్పటినుంచి ఎంతో ఇష్టంతో నేర్చుకున్న డ్యాన్స్ ఇప్పుడు జీవనోపాధి కల్పిస్తోంది.

తన ఇబ్బందులు కుటుంబానికి రాకుండా

భుజంగరావు మంచి భవిష్యత్‌కోసం పరితపిస్తున్నాడు. 2019లో పొందూరుకు చెందిన నాగమణి అనే యువతిని వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద కుమార్తె నిహారిక 1 వ తరగతి పెనుబాక పాఠశాలలో చదువుతోంది. రెండవ కుమార్తె సాత్విక ఏడాదిన్నర వయస్సు ఉంటుంది. తాను కుటుంబానికి భారం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో స్టేజ్ షోలు చేస్తున్న భుజంగరావు అవకాశాలు వచ్చినప్పుడల్లా బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లి టీవీషోలు, సినీ ప్రమోషన్ షోల్లో తన డ్యాన్స్‌తో ప్రతిభ చాటుతున్నాడు. నిత్యం ఏదో ఒక స్టేజ్ షో చేస్తూ కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నాడు.

విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయాలి

- కలెక్టర్ అంబేడ్కర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: ఈనెల 10వతేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా భోజనానంతరం అరగంట తర్వాత అల్బెండజోల్ మాత్రలు విద్యార్థులకు వేయాలని కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యాధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్ల మండలంలో తప్ప జిల్లా అంతటా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అల్బెండజోల్ మాత్రలు 19 ఏళ్ల లోపు ఉన్న వారంతా వేసుకోవాలని చెప్పారు. సుమారు 3 లక్షల 60 వేల మందికి అన్ని పాఠశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల్లో విద్యార్థులందరికి, బడిబయట ఉన్న 19 ఏళ్ల లోపు వారికి తప్పక మాత్రలు వేయాలని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శులు ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. వైద్యశాఖ ద్వారా వైద్యసిబ్బందికి, ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు మాత్రలు ఏవిధంగా వేయాలో అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓలు, మండల ప్రత్యేకధికారులు కూడా కార్యక్రమంలో పాల్గొని పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, జెడ్పీ సీఈఓ బి.సత్యనారాయణ, డీపీఓ వెంకటేశ్వరావు, సీపీఓ బాలాజీ, డీఈఓ మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష పీఓ డాక్టర్ ఎ.రామారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా 12 దరఖాస్తులు


ఇన్‌చార్జ్ ఈఎస్ శ్రీనాథుడు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు రిజర్వ్‌డ్ షాపులకు సంబంధించి గీత కార్మికుల నుంచి ఇప్పటి వరకు 12 దరఖాస్తులు స్వీకరించినట్లు ఇన్‌చార్జ్ ఈఎస్ శ్రీనాథుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాలూరు-2, పార్వతీపురం-2, వీరఘట్టం-5, పాలకొండ-3 దరఖాస్తులు అందిన ట్లు తెలిపారు. ఈ నెల 8 వర కు దరఖాస్తులకు గడువు పొ డిగించినట్లు చెప్పారు. లాట రీ విధానంలో ఈ నెల 10న షాపులు కేటాయిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోసలి సమీపంలో ఏనుగుల విధ్వంసం

భామిని: మండలంలోని కోసలి రైతులకు పంటనష్టాలు కలిగించడంలో నాలుగు ఏనుగుల గుంపు గురువారం తలమునకలైంది. ఘనసర-తాలాడ గ్రామాల సమీపంలోని ఏనుగులు కోసలి వైపు నడిచి రైతులు పండించే మొక్కజొన్న, కర్బూజా, ఇతర కూరగాయల పంటలపై దాడి చేసి తినివేస్తున్నట్లు బాధిత రైతులు వాపోతున్నారు. పంటపొలాల్లో ఏనుగుల గుంపు తిష్ఠ వేసినట్లు కోసలి గ్రామస్తులను ఫారెస్ట్ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టి ద్విచక్రవాహన చోదకుడి మృతి


మృతుడు శ్రీనివాస రావు (ఫైల్)

చీపురుపల్లి: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మండలంలోని విజయరాంపురం గ్రామానికి చెందిన దన్నాన శ్రీనివాసరావు(35) ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టి మృతిచెందాడు. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్సై ఎల్.దామోదరరావు తెలిపిన వివరాల్లోకి వెళ్తే..బుధవారం రాత్రి 10 గంటల సమయంలో పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చీపురుపల్లి నుంచి గరివిడి వైపు వెళ్తున్న ట్రాక్టర్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న శ్రీనివాసరావు బలంగా ఢీ కొట్టాడు. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విజయరాంపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు విశాఖపట్టణంలో తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ చీపురుపల్లి నుంచి రైలులో ప్రయాణించి విశాఖలో పని ముగించుకుని తిరిగి వస్తుంటాడు. అయితే తన భార్య, పిల్లలు గజ్జింగివలసలోని అత్తవారింట్లో ఉండడంతో వారి వద్దకు బుధవారం రాత్రి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘాట్‌రోడ్డులో మరో వ్యక్తి..

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస జాతీయ రహదారి ఘాట్‌రోడ్డుపై గురువారం ఉదయం లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన లారీ ఒడిశా నుంచి సాలూరు వైపు వస్తుండగా సాలూరు నుంచి ఒడిశా వెళ్తున్న స్కూటీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న వ్యక్తి ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్‌కు చెందిన సుందరి కృష్ణ (25) అక్కడికక్కడే మతి చెందాడు, లారీ క్లీనర్, స్కూటీ వెనుక కూర్చున్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా వారిద్దరినీ సాలురు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంఘటన జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడని, ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసిన హెచ్‌సీ కృపారావు తెలిపారు.

భర్త చేతిలో భార్య హతం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ జీఏవీ రమణ, ఎస్సై జయంతి,(ఇన్‌సెట్‌లో) గౌరమ్మ (ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని గుచ్చిమి గ్రామ సమీపంలో గల ఆయిల్ పాం తోటలో చుక్కపేట గ్రామానికి గ్రామానికి చెందిన యాకల గౌరమ్మపై(44) ఆమె భర్త సత్యం కొడవలితో దాడి చేసి హత్యకు పాల్పడ్డాడు. గురువారం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుచ్చిమి గ్రామంలోని పొలాల్లో వరి కంకులు కోయడానికి గౌరమ్మ చుక్కపేట నుంచి ఉదయం బయల్దేరి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన భర్త కొడవలితో ఆమె ఒంటిపైన చెవులు, తలపైన దాడి చేయడంతో పొలాలకు వెళ్లే చిన్న పాటి దారిలో కుప్పకూలిపోయింది. కిందపడిన ఆమె ఒంటిపై కొడవలితో తీవ్రగాయాలు చేశాడు. ఈ విషయాన్ని సమీపంలో పనులు చేస్తున్న స్థానికులు గమనించి మృతురాలి కుటుంబసభ్యులు, 108వాహనానికి సమాచారం అందించారు. సమాచారం మేరకు వచ్చిన 108 సిబ్బంది గౌరమ్మను పరిశీలించి అక్కడికక్కడే మృతిచెందినట్లు నిర్ధారించారు. తల్లి గాయాల పాలైందని తెలుసుకుని వచ్చిన కుమారుడు గణేష్, కుమార్తె భవానిలు మృతిచెందిన తల్లిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పెదమానాపురం ఎస్సై జయంతి సిబ్బంది చుట్టుపక్కల పరిశీలించి కొద్ది దూరంలో పడి ఉన్న కొడవలిని గమనించారు. సంఘటనా స్థలానికి గజపతినగరం సీఐ జీఏవీ రమణ వచ్చి క్లూస్ టీమ్‌ను రప్పించి నిందితుడు ఎటు వైపు నుంచి తప్పించుకుని పారిపోయాడో పరిశీలించారు. కుమారుడు గణేష్ సీఐఎస్‌ఎఫ్ ఉద్యోగం చేస్తూ సెలవుపై వచ్చి ఇంటి వద్ద ఉన్నాడు, కుమార్తె కూడా ఇంట్లోనే ఉంటోంది. తల్లిదండ్రులు పొలంపనికి వెళ్తుండగా గొడవ పడి తల్లి మృతి చెందడంతో పిల్లలిద్దరూ గుండెలవిసేలా రోదిస్తున్నారు.

బాలోత్సవ్ విజేతలుగా బాలికోన్నత స్కూల్ విద్యార్థినులు


బహుమతులు, జ్ఞాపికలతో ప్రభుత్వ బాలికోన్నత స్కూల్ విద్యార్థినులు

విజయనగరం అర్బన్: పట్టణంలో మంగళ, బుధవారాల్లో జరిగిన జిల్లా స్థాయి బాలోత్సవ్-8 సాంస్కృతిక అంశాల పోటీల్లో దాసన్నపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు పలువురు విజేతలుగా నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.రమణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. స్పెల్ బీ సీనియర్స్ విభాగంలో డి.సాయిలలితశ్రీకి, డ్రాయింగ్ సీనియర్స్ విభాగంలో జి.గీతాంజలికి, కథారచన సీనియర్స్ విభాగంలో ఆసియా అహ్మద్‌కు, డ్రాయింగ్ జూనియర్స్ విభాగంలో జె.శశిరేఖకు ప్రథమ బహుమతులు లభించాయి. కథారచన సీనియర్స్ విభాగంలో పి.ఝాన్సీకి, పాటల సీనియర్స్ విభాగంలో అన్నపూర్ణేశ్వరికి, వక్తృత్వం సీనియర్స్ విభాగంలో ఆసియా అహ్మద్‌కు తృతీయ బహుమతి లభించిందని పేర్కొన్నారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో విజేతలను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

గురజాడ స్కూల్ విద్యార్థులకు బహుమతులు

బాలోత్సవ్ సాంస్కృతిక పోటీలలో పట్టణానికి చెందిన గురజాడ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పలువురు విజేతలుగా నిలిచారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్ తెలిపారు. లఘునాటిక జూనియర్స్ విభాగంలో ప్రథమం, జానపదం జూనియర్స్ విభాగంలో ద్వితీయం, వ్యాసరచన జూనియర్స్ విభాగంలో ద్వితీయం, వ్యకృత్వ జూనియర్ విభాగంలో తృతీయ బహుమతులకు 42 మంది విద్యార్థుల బృందం సాధించినట్లు తెలిపారు. విజేతలను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవీఆర్‌కృష్ణాజీ, కరస్పాండెంట్ ఎం.స్వరూప, ఉపాధ్యాయులు అభినందించారు.

వీడీవీకేలను బలోపేతం చేయాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రధానమంత్రి వన్‌ధన్ వికాస కేంద్రాల(వీడీవీకే) కార్యకలాపాలను పార్వతీపురం మన్యం జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో గిరిజన సహకార కార్పొరేషన్ (జీసీసీ) మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 68, సీతంపేట ఐటీడీఏ పరిధిలో 54 వీడీవీకేలున్నాయి. అటవీ ప్రాంతంలో లభించే ముడిసరుకులైన కొండ చీపుళ్లు, చింతపండు, పసుపు, జీడిపప్పు, మినుము, సబ్బులు మొదలైన వాటి ద్వారా వీడీవీకేల వ్యాపారం చేస్తూ అగరబత్తీలు, చిరుధాన్యాల బిస్కెట్లు, చింతపండు తదితరాలను ఉత్పత్తి చేస్తున్నాయని అన్నారు. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ ప్రాంతాల్లో కొండచీపుళ్లు, పసుపు, చింతపండు, జీడిపప్పు లభ్యత ఎక్కువగా ఉంది. జిల్లాలో దాదాపు 65 వేల హెక్టార్లలో జీడి సాగు జరుగుతుండగా, కేవలం సీతంపేట ప్రాంతంనుంచే దాదాపు ఏడు లక్షల కొండ చీపుర్లు ఉత్పత్తి అవుతున్నాయని వివరించారు. వాటన్నింటిని అధికారులు పరిగణనలోకి తీసుకుని నాణ్యమైన, పరిమాణాత్మక ఉత్పత్తులు, బ్రాండింగ్, ప్యాకింగ్‌తోపాటు మంచి మార్కెటింగ్ అందించేలా ఆలోచించాలని సూచించారు. గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి మాట్లాడుతూ అనేక శాఖలు, సంస్థలతో కలిసి ఉత్పత్తులను విక్రయించవచ్చన్నారు. సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి. యశ్వంత్‌కుమార్‌రెడ్డి, జీసీసీ జనరల్ మేనేజర్ సంధ్య, డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్, పార్వతీపురం ఐటీడీఏ ఏపీఓ మురళీధర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యం నాయుడు, సీతంపేట డీపీ సన్యాసి రామారావు, ఏపీడీఎం సన్యాసి రామారావు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు

- ఎస్పీ వకుల్ జిందల్



విజయనగరం క్రైమ్: ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడడంతో జిల్లాలో ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా అమలుచేయాలని, కోడ్ ఉల్లంఘిస్తే కఠినచర్యలు చేపట్టాలని అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ మేరకు గురవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ వెలువడడంతో ఎన్నికల నిబంధనలు, ప్రవర్తనా నియామవళిని జిల్లాలో కచ్చితంగా అమలుచేయాలని అధికారులను ఆదేశించారు. మార్చి 8వ తేదీ వరకూ కోడ్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాల్లో, పబ్లిక్ ప్రదేశాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు లేకుండా చూడాలని, విగ్రహాలకు ముసుగు వేసే విధంగా మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో తుపాకుల లైసెన్స్‌లు కలిగిన వ్యక్తుల నుంచి ఆయుధాలను డిపాజిట్ అయ్యే విధంగా చూడాలని చెప్పారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను ఎగ్జిక్యూట్ చేయాలని, ఇందుకు బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటుచేయాలని సూచించారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు లేకుండా చూడాలని, విస్తృతంగా దాడులు చేయాలని, మద్యం అక్రమంగా విక్రయించేవారిపైన కేసులు నమోదుచేయాలని స్పష్టం చేశారు. రాత్రిబీట్లను, పగటిబీట్లను వేయాలని, గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలను ముందుగా గుర్తించి, ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. దత్తత గ్రామాల్లో పోలీసు సిబ్బంది వారంలో రెండు సార్లు సందర్శించి, క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరించి, ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. ఎన్నికల కోడ్‌ను అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో సంబంధిత సీఐలు వారి పరిధిలో పనిచేసే ఎస్సైలకు మార్గదర్శకం చేయాలని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలు తీరును విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డీఎస్పి ఎస్.రాఘవులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

వ్యాధి నిరోధక టీకాలు శతశాతం వేయాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: వ్యాధి నిరోధక టీకాలు శతశాతం వేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవన రాణి తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఆమె పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృ వందన యోజన కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేయాలని సూచించారు. అన్ని పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని చెప్పారు. బీపీ, సుగర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని కోరారు. క్షయ, కుష్ఠ వ్యాధులపై సర్వే సమగ్రంగా చేపట్టాలని సూచించారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తులు మందులు సకాలంలో వాడేలా చూడాలని చెప్పారు. మాతృ, శిశు మరణాలు జరగకుండా గర్భిణులను సకాలంలో ఆస్పత్రికి చేర్చాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ ఆర్. అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, ఎన్‌సీడీపీఓ డాక్టర్ బీవీవీ సుబ్రహ్మణ్యం, డీఎంఓ వై.మణి, ఎస్‌ఓ ధర్మారావు, డీపీహెచ్‌ఎన్ మామిడి సత్యవతి, డెమో వి.చిన్నతల్లి పాల్గొన్నారు.

గరివిడిలో చోరీ

- రెండు ఉంగరాలు, 5వేల నగదు అపహరణ


దొంగతనం జరిగిన ఇంటిలో ఆధారాలు పరిశీలిస్తున్న క్లూస్ టీమ్, ఎస్‌ఐ.

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని జగన్నాథ కాలనీలో చోరీ జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై బి.లోకేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరివిడి పట్టణంలోని జగన్నాథ కాలనీలో నివాసం ఉంటున్న బాసిన సతీష్ ఈనెల 2వ తేదీన పనినిమిత్తం బయటకు వెళ్లాడు. ఈ నెల 5న రాత్రి 8గంటలకు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి ముందర గ్రిల్స్ గేటు విరగ్గొట్టి తలుపులు తెరిచి లోపల ఉన్న బెడ్‌రూంలోకి ప్రవేశించి బీరువా తలుపులు బలవంతంగా తెరిచి అందులో ఉన్న వస్త్రాలను చెల్లాచెదురు చేసినట్లు ఉన్నాయి. బీరువా లాకర్‌లో ఉన్న రెండు బంగారపు ఉంగరాలు(ఒక్కొక్కటి పావుతులం) 5వేల రూపాయలు నగదు దొంగతనానికి గురయ్యాయి. ఈ మేరకు బాధితుడు సతీష్ తామెవరూ ఇంటిలో లేనప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలో ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ దొంగతనం జరిగిన ప్రాంతంలో కొన్ని ఆధారాలను సేకరించింది.